

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అర్హులందరికీ వైకల్య గుర్తింపు కార్డులివ్వండి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్

ఎర్రగడ్డ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అరు లైన వారందరికీ వైకల్య గుర్తింపు కార్డులను (యూడీఐడీ) జారీ చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో కొనసాగుతున్న యూడీఐడీ శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వహణ గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కుర్చీలు, హాల్లో ఏసీల ఏర్పాటు, కంప్యూటర్ వసతి, విద్యుత్ సౌకర్యం, నీటి వసతి వంటి ఏర్పాట్లను పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత మాట్లాడుతూ.. మానసిక చికిత్సాలయం నుంచి మెంటల్ ఇల్‌నెస్ ఇంటలెక్చువల్ డిసేబులిటీకి సంబంధించి కార్డులను జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటాచారి, ఎమ్మార్వో సునీత, ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ఆర్‌ఎంవో డాక్టర్ రమేష్, డాక్టర్ వివాస్వాన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చింతల్ బస్తీ కల్లుగీత సంఘం ఎన్నిక రద్దు తీర్పును అమలు చేయాలి

● వేణుగోపాల్‌గౌడ్

బంజారాహిల్స్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): చింతల బస్తీ కల్లుగీత సహకార సొసైటీ ఎన్నిక రద్దు చేస్తూ సహకారశాఖ ట్రిబ్యునల్ తీర్పు వెల్లడించి మూడు నెలలు గడిచినా అబ్కారీ శాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం లేదని చింతల్ బస్తీ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పి.వేణుగోపాల్ గౌడ్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సొసైటీకి చెందిన సభ్యుల ఓట్లను గల్లంతు చేసి బోగస్ ఓట్లతో 2022 జూన్ 6న నిర్వహించిన ఎన్నికను రద్దు చేయాలని ట్రిబ్యునల్‌ను ఆశ్రయించానన్నారు. చిన్నపిల్లలను, బయటి వ్యక్తులను ఓటర్లుగా చూపించి నిర్వహించిన ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చినప్పటికీ సహకారశాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. చింతల్ బస్తీ సొసైటీకి చెందిన చీఫ్ ప్రమోటర్ సుగుణమ్మతో పాటు పాలకమండలి మీద కల్తీ కల్లు విక్రయం చేశారని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదైందని ఆయన వెల్లడించారు. వందలాది మంది గీత కార్మికుల పొట్టకొట్టి బడాబాబులకు దోచిపెట్టేలా ఎక్సైజ్ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిజమైన కార్మికులకు న్యాయం చేయకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.



టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేసిన భవనం

కూల్చివేసినా మారని తీరు

● యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

ఎర్రగడ్డ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపడుతున్నప్పటికీ ఎర్రగడ్డలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎర్రగడ్డ అల్‌నూర్ మసీద్ ప్రాంతంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని గత నెలలో టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. కేవలం జి ప్లస్ వన్ వరకే పర్మిషన్ ఉన్న భవనాన్ని ఐదు ఫ్లోర్ల వరకు నిర్మించారు. దీంతో అధికారులు 3, 4, 5 ఫ్లోర్లను స్లాబ్‌లతో సహా కూల్చి వేశారు. అయినప్పటికీ సదరు ఇంటి యజమాని వాటిని తిరిగి నిర్మిస్తున్నాడు. అప్పట్లో అనుమతి లేకుండా భవనాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినప్పటికీ కూల్చివేసిన నిర్మాణాలను తిరిగి చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా కేవలం పర్మిషన్ ఉన్న జి ప్లస్ వన్ నిర్మాణాన్ని మాత్రమే ఇంటి యజమాని నిర్మిస్తున్నాడని టౌన్ ప్లానింగ్ అధికారి నరేష్ తెలిపారు. అదనపు అంతస్తులను కూల్చివేసినట్లు తెలిపారు. దీనిపై మున్సిపల్ కమిషనర్, మేయర్‌లకు సైతం ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.



గాంధీ ఓపీ బ్లాక్ పక్కన దుమ్ము పట్టిన బైక్‌లు

ఈ వాహనాలు ఎవరివో?

అడ్డగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలోని ఓపీ బ్లాక్ పక్కనే దాదాపు కొన్నేళ్ల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు బైకులు పార్క్ చేసి వెళ్లిపోయారు. అయితే అవి దుమ్ము పట్టి పాడైపోయినా ఇప్పటి వరకు ఈ బైక్‌లు ఎవరివనే విషయంపై పార్కింగ్ ఇన్‌చార్జి, సెక్యూరిటీ గార్డులు ఆరా తీసిన పరిస్థితి లేదు. బైకుల నంబర్ల ఆధారంగా యజమానులు ఎవరనే విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. ఇలా గాంధీలో కొన్నేళ్ల క్రితం పార్కింగ్‌లో వదిలిపెట్టిన వాహనాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. అయితే ఇవి దొంగలు ఎత్తుకొచ్చిన బైకులా? అనే అనుమానం సైతం వ్యక్తమవుతోంది. వెంటనే వీటి యజానులు ఎవరో గుర్తించి వారికి అప్పగించాలని, దొంగ బైక్‌లు అయితే పోలీసులు ఈ విషయంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు 11కెవి బేగంపేట గ్రేహౌండ్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కెవి ఎస్.ఆర్.టి నగర్ మార్కెట్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు 11కెవి విద్యుత్ టవర్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు న్యూశాస్త్రి నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

స్విమ్మింగ్ పూల్ సిద్ధం

● ఏప్రిల్ 2 నుంచి ప్రజలకు అందుబాటులోకి
● రోజుకు ఆరు బ్యాచ్‌లు.. ఒక్కో బ్యాచ్‌లో 50 మందికి అవకాశం
● మహిళలకు ప్రత్యేకంగా సమయం కేటాయింపు

బేగంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉక్క పోత నుంచి సేద తీరేందుకు పిల్లలు, పెద్దలు కాసేపు ఈత కొలనులో సేద తీరేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలోనే స్థానికుల విజ్ఞప్తి మేరకు కొన్నేళ్ల క్రితం సనత్‌నగర్‌లో ఈత కొలను అందుబాటులోకి అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే గత ఏడాది ఓ బాలుడు ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందడంతో అప్పట్లో దీన్ని మూసివేశారు. ఈ వేసవిలో తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. సనత్‌నగర్‌లోని (కార్మిక సంక్షేమ కేంద్రం) ఆవరణలో ఉన్న ఈత కొలనును స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రెహానా బేగం, జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి, వెల్ఫేర్ గ్రౌండ్ ఇన్‌చార్జి మల్లేష్ తదితరులు గురువారం ప్రారంభించారు.

నెలకు రూ.500 చెల్లించాలి

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న సనత్‌నగర్ ఈత కొలనును రెండు బోర్ల ద్వారా గత రెండు నెలలుగా నింపుతున్నారు. సుమారు 160 ట్యాంకర్ల సామర్థ్యం గల నీటితో ఇప్పటికే పూర్తి స్థాయి వరకు నింపేశారు. ఈతకు వచ్చే వారు స్నానాలు చేయడం కోసం సమీపంలోనే 50 వేల లీటర్లను అందుబాటులో ఉంచారు. గతంలో జలమండలి ట్యాంకర్ల ద్వారా ఈత కొలనును నింపేవారు. ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్స్‌కు వాటర్ సరఫరా లేకపోవడంతో వెల్ఫేర్ గ్రౌండ్‌లో ఉన్న రెండు బోర్ల ద్వారా నింపినట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం 6-7, 7-8, 8-9 గంటలకు.. సాయంత్రం 4-5, 5-6 గంటలకు జనరల్ బ్యాచ్‌లను అనుమతిస్తారు. మధ్యాహ్నం 3-4 గంటల మధ్య మహిళల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయిస్తారని అధికారులు తెలిపారు. ఒక్కో బ్యాచ్‌లో సుమారు 50 మంది వరకు ఈత కొట్టే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈత నేర్పేందుకు ఆరుగురు శిక్షకులు, నిర్వహణ కోసం ఏడుగురు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఈత కొలనును వినియోగించుకునేందుకు నెలకు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. www.ghmc.gov.in/sports వెబ్‌సైట్‌లో ఫీజు చెల్లించవచ్చు. ఈత కొలను కోసం దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా వైద్యుడు ధృవీకరించిన మెడికల్ సర్టిఫికెట్‌తో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన కాపీ, ఆధార్ కార్డు, ఫొటోను స్విమ్మింగ్ పూల్ ఇన్‌చార్జికి అందజేయాలి.



స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించిన అనంతరం స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రెహానా బేగం, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి తదితరులు



ఈత కొలనులో నిండుగా ఉన్న నీరు

2 నుంచి దరఖాస్తులకు అవకాశం

ఈత కొలనులో ప్రస్తుతం బ్లీచింగ్ వేయడంతో పాటు ఇతర పనులు జరుగుతున్నాయి. ఉగాది, రంజాన్ పండుగల అనంతరం దీనిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. ఏప్రిల్ 2 నుంచి సనత్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారికి 2 నుంచి వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుంది. ఈతకు వచ్చే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. శిక్షకులు చెప్పిన విధంగా నడుచుకోవాలి. ఈత కొలనులో నీటిని నిత్యం శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం.

- మాధవి, గేమ్స్ ఇన్‌స్పెక్టర్, జీహెచ్‌ఎంసీ, ఖైరతాబాద్ జోన్



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్ చౌరస్తాలో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

బంజారాహిల్స్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఖైరతాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఎంను కలిసి వినతిపత్రం అందించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా జ్యోతిరావు పూలే వంటి మహనీయులను స్మరించాల్సిన అవసరం ఉందని దానం అన్నారు. విగ్రహం పెట్టడం వల్ల పూలే గురించి భవిష్యత్తు తరాలకు తెలుస్తుందన్నారు. తన విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన వెల్లడించారు.

మద్యం విక్రయాల సమయాన్ని తగ్గించాలి

● బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్

పంజాగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం విక్రయాల సమయాన్ని తగ్గించాలని,నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పర్మిట్ రూంలను, బెల్ట్ షాపులను తొలగించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రధాన కార్యదర్శి పి.రాజు గౌడ్ అధ్యక్షతన అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దామోదర్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బార్ యజమానులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తమ సమస్యలను పరిష్కరించలేదన్నారు. వైన్‌షాప్ పర్మిట్ రూమ్ నిబంధనలను ఎవరూ పట్టించుకోవడం లేదని, జిల్లాలు, పట్టణాలు, గ్రామాల్లో ఉన్న బెల్ట్ దుకాణాలను తొలగించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని మద్యం దుకాణాలు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే తెరిచి ఉంటుండగా.. నగరంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 వరకు తెరిచి ఉంచుతున్నారన్నారు. నగరంలో ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకే మద్యం దుకాణాల్లో విక్రయాలకు అనుమతివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, శాఖ కమిషనర్ హరికిరణ్ లను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్, కోశాధికారి మోహన్ గౌడ్, ఉపాధ్యక్షులు ఇ.రామకృష్ణ, జి.శ్రీనివాస్ గుప్తా, ఎం.నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్ గౌడ్

ఇఫ్తార్ సందడి



బంజారాహిల్స్‌లో గురువారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్, బేగంపేట సీనియర్ కాంగ్రెస్ నాయకుడు విశాల్ సుధాం

- బేగంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి)

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

● బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్

పంజాగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చేసిన చట్టాన్ని అసెంబ్లీ ఆమోదించిందని, కేంద్ర ప్రభుత్వం సైతం వెంటనే పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న తలపెట్టిన చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్ కల్పించాలని, క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో మహాధర్నాకు ప్రత్యేక రైలులో బయలుదేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆర్.జ్ఞానేశ్వర్, జగన్, విక్రమ్, మంజులత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్ గౌడ్ తదితరులు



ఇఫ్తార్ విందుకు హాజరైన నీలిమ తదితరులు

పాటిగడ్డలో..

బేగంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ నెల పవిత్ర మాసమని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. గురువారం రాత్రి బేగంపేటలోని పాటిగడ్డలో కాంగ్రెస్ యువనేత అడపా అభిషేక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు నీలిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు షేక్ గౌస్, అమరం శ్రీనివాస్‌రెడ్డి, సలీంఖాన్, యువజన కాంగ్రెస్ నేత షభాజ్ ఖాన్, హనిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే 'జీవన్‌ధాన్ యాక్ట్'

● గూడూరు సీతామహాలక్ష్మి

పంజాగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అవయవ దానం బిల్లు తీసుకొచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ కృతజ్ఞతలు తెలుపుతున్నామని అఖిల భారత అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రిబాయి పూలే చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అవయవ, శరీర, నేత్ర, రక్త దానంపై 21 సంవత్సరాలుగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. తమ పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం జీవన్ ధాన్ యాక్ట్‌ను తీసుకొచ్చిందన్నారు. 2014-2024 సంవత్సరాల మధ్య ఆరు వేల మందికి పైగా అవయవ దానంతో పునర్జన్మ పొందారని చెప్పారు. తాము చనిపోతూ మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపుతున్న వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రి కేటీఆర్ అవయవ దానం చేస్తానని ముందుకు వచ్చారని, ఇలా ప్రతి ఒక్కరూ ముందుకు వస్తే అవయవ దానం కోసం ఎదురుచూస్తున్న వారికి ఎంతో ఉపశమనం ఉంటుందన్నారు. ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఏపీ, పుదుచ్చేరి రాష్ట్రాలు నేషనల్ ఆర్గాన్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ ఇచ్చిన సర్క్యులర్‌ను పాటిస్తూ అవయవ దాతల అంత్యక్రియలకు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ సమన్వయకర్త శ్రీనివాస్, రాష్ట్ర సహ కార్యదర్శి రజని, పి.కవిత, రామలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీతామహాలక్ష్మి

ఖైరతాబాద్‌లో..



ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని విద్యుత్‌ప్రభ భవన్‌లో విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి.అంజయ్య, అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు నాసర్ షరీఫ్, వి.పరమేష్, కొరడాల వెంకటేశ్వర్లు, స్వామి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి)



అర్జీలను స్వీకరిస్తున్న డా. చిన్నారెడ్డి

ప్రజావాణికి 298 అర్జీలు

బేగంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 298 వినతులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 64, విద్యుత్‌కు 20, రెవెన్యూకు 67, మున్సిపల్‌కు 14, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇందిరమ్మ ఇళ్లకు 83, ఇతర శాఖలకు 49 చొప్పున అర్జీలు అందినట్లు ప్రజావాణి అధికారులు తెలిపారు.

ఫైనాన్స్ సంస్థలో బంగారు ఆభరణాల డిపాజిట్‌లో గోల్‌మాల్

● తనకు సంబంధం లేకపోయినా వేధిస్తున్నారని బాధితుడి ఫిర్యాదు

పంజాగుట్ట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో జరిగిన బంగారు ఆభరణాల డిపాజిట్‌లో గోల్‌మాల్ ఘటనలో తన ప్రమేయం లేకున్నా తనపై కేసు పెట్టి వేధిస్తున్నారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫైనాన్స్ సంస్థకు చెందిన ముగ్గురు మేనేజర్లపై న్యాయస్థానం ఆదేశాల మేరకు మొదట మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఘటన జరిగింది పంజాగుట్ట పీఎస్ పరిధిలో కావడంతో కేసును అక్కడికి బదిలీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ సాగర్ సొసైటీకి చెందిన వ్యాపారవేత్త నిఖిల్ కొఠారి గత సంవత్సరం డిసెంబరు నెలలో మారేడ్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో బంగారు ఆభరణాలు కుదవపెట్టి రూ.90 లక్షలు రుణంగా తీసుకున్నాడు. నెలవారీగా వాయిదా చెల్లిస్తున్నాడు. అతడి స్నేహితులు అజయ్ కుమార్, సిద్ధాంత్ జైన్, మోయిజ్ ఖాన్‌లు సైతం తమ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రూ.24 లక్షలు తీసుకున్నారు. వాటిని పరీక్ష చేయగా అవి బంగారు పూత పూసినవిగా గుర్తించారు. స్నేహితులు నకిలీ ఆభరణాలతో రుణాలు తీసుకున్నారని, వెంటనే డబ్బులు చెల్లించాలని నిఖిల్ కొఠారిని మేనేజర్లు రవీందర్, జ్యోతి శ్రీలత, జోనల్ మేనేజర్ రోజా బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

సోదరిని వేధిస్తున్నాడని బావపై కత్తితో దాడి

బోరబండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సోదరిని వేధిస్తున్న బావను బామ్మర్ది కత్తితో పొడిచిన ఘటన రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఖమ్మంకు చెందిన ఐటీ ఉద్యోగి కిరణ్ రాథోడ్ (30) రహ్మత్‌నగర్ బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఐదేళ్ల క్రితం కిరణ్ రాథోడ్ విజయవాడకు చెందిన గీతికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలంగా కిరణ్ తన భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో సోదరిని చూసేందుకు ముంబై నుంచి వచ్చిన ఆమె తమ్ముడు స్టాక్ మార్కెట్ వ్యాపారి ముఖేష్ నాయక్ (24) వారి ఇంటికి వచ్చాడు. భర్త వేధిస్తున్నాడని గీతిక తన తమ్ముడి ఎదుట కన్నీళ్లు పెట్టుకుంది. అక్క కన్నీటిని చూసి ముఖేష్ తన బావపై కక్షగట్టాడు. శుక్రవారం గీతిక పఠాన్ చెరులోని బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో బావ, బామ్మర్ది కలిసి మద్యం తాగారు. తన సోదరిని వేధిస్తే అంతుచూస్తానని ముఖేష్ అనడంతో షేర్ మార్కెట్ పెట్టుబడి కోసం తమ డబ్బు ఎందుకు తీసుకున్నావని బామ్మర్దిని కిరణ్ ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ముఖేష్ బావ ఛాతిపై, కాళ్లపై పొడిచాడు. బాధితుడు కిరణ్ ఇచ్చిన సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వేలో 92 మంది ఉద్యోగ విరమణ



వివేకానందను సత్కరించి వీడ్కోలు పలుకుతున్న సీహెచ్. రామకృష్ణ తదితరులు

చిలకలగూడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 92 మంది ఉద్యోగులు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్ షాపులో వీరు విధులు నిర్వహించారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలతో సందడి నెలకొంది. సికింద్రాబాద్ రైల్ నిలయంలో అకౌంట్స్ విభాగంలో ఉద్యోగ విరమణ చేయనున్న ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ యస్. వివేకానంద, సీనియర్ సెక్షన్ ఆఫీసర్ కె.స్వరూప రాణి, సీనియర్ అకౌంటెంట్ ఈమని రవికుమార్, హైదరాబాద్ డివిజన్‌లో సీనియర్ సెక్షన్ ఆఫీసర్ షేక్ రవూఫ్‌ను తోటి ఉద్యోగులు శాలువ, జ్ఞాపికలు అందజేసి సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. వారికి రావాల్సిన గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్, లీవ్ సాలరీలు వారివారి బాంక్ ఖాతాల్లో జమచేస్తూ పెన్షన్ పత్రాలు అందజేశారు.

రాజశేఖర్‌రెడ్డికి సన్మానం



బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిని సన్మానించిన సీపీఐ నాయకులు

అడ్డగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): న్యాయ వృత్తిలో మరింత రాణించాలని సీపీఐ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ సూచించారు. సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి అభినందించారు. అధ్యక్షుడిని కలిసిన వారిలో సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, శ్రీహరి ఉన్నారు.

న్యాయం కోసం పనిచేస్తాం



సికింద్రాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం

అడ్డగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం వృత్తిధర్మాన్ని కాపాడుకుంటామని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ కోర్టులో శుక్రవారం ప్రత్యేక సమావేశమైయ్యారు. అధ్యక్షుడిగా రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వినోద్ కుమార్, కార్యదర్శులు సురేష్, మహేశ్వరి, స్వామి, మురళీధర్ యాదవ్, సంతోష్, సంజీవ్ కుమార్, పావని, సమత, అనితలు గెలుపొందగా పండుగ సంబురాలు జరుపుకున్నారు. తాము న్యాయం కోసం వృత్తి ధర్మాన్ని కాపాడుకుంటామన్నారు.

వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు



అడ్డగుట్టలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

అడ్డగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆశ్రయ్ రెయిస్ బో హెమ్స్ జనహిత సేవా ట్రస్ట్ కిమ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బస్తీల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను అడ్డగుట్ట వాసులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న దాదాపు 150 మందికి వైద్యం అందించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ ఎం.శ్రీనివాస్, ఆశ్రయ్ సంస్థ డైరెక్టర్ నవీన్ రాజ్, ఆఫీసర్ గ్రేస్ సీబీసీ కో-ఆర్డినేటర్ సుధాకర్, రెయిన్ బో ఫౌండేసన్ జాతీయ ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీలత, సిటీ డెస్క్ మేనేజర్ క్రాంతి కిరణ్, భవిత ఫౌండేషన్ డైరెక్టర్ కబీర్, కిమ్స్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ విక్రమ్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు నర్సింహమూర్తి, వెంకటనారాయణ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం

ముషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎ.రాములు(80) శుక్రవారం మృతి చెందగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆయన నివాసానికి వెళ్లి సంతాపం తెలిపారు. ఆయన తోపాటు బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, ముఠా జైసింహా, పూస గోరక్‌నాథ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పార్టీ ముషీరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, కుమ్మరి సంఘం అధ్యక్షుడు బండారి గోపాల్, ఉపాధ్యక్షులు టిల్లూ, కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌లు నివాళులర్పించారు.

ఈ బైక్‌లు ఎవరివి?

- గాంధీలో తుప్పుపట్టిన గుర్తుతెలియని వాహనాలు
- ఐదేళ్ల క్రితం పార్కింగ్‌లోనే..



గాంధీ ఓపీ బ్లాక్ పక్కనే తుప్పుపట్టిన బైక్‌లు

అడ్డగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలోని ఓపీ బ్లాక్ పక్కనే దాదాపు కొన్నేళ్ల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు బైకులు పార్కు చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు బైక్‌లు తుప్పుపట్టడంతో ఈ బైక్‌లు ఎవరివనే విషయంపై పార్కింగ్ ఇన్‌చార్జి సెక్యూరిటీ గార్డులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ బైకుల నెంబర్ల ఆధారంగా యజమానులు ఎవరనే విషయాన్ని ఎవరూ ఆలోచించలేదు. ఇలా గాంధీలో కొన్నేళ్ల క్రితం పార్కింగ్‌లో వదిలిపెట్టిన వాహనాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. లేదంటే దొంగలు ఎత్తుకొచ్చిన బైకులా? అనే అనుమానం వ్యక్తమవుతోంది. వెంటనే ఈ బైకుల యజానులు ఎవరో గుర్తించి వారికి అప్పగించాలని, దొంగ బైక్‌లు అయితే చిలకలగూడ పోలీసులు ఈ విషయంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రమాదాల అడ్డా.. లాల్‌బజార్ చౌరస్తా!

- అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు
- తరచూ ప్రమాదాలు
- వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

తిరుమలగిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిలోని లాల్‌బజార్ చౌరస్తా తరుచూ ప్రమాదాలకు అడ్డాగా మారింది. రాజీవ్ రహదారి గుండా తెలంగాణ జిల్లాలకు అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. దీంతో పాటు లాల్‌బజార్ చౌరస్తాలో జనసమర్థం అధికంగా ఉంటుంది. ఒక పక్క తెలంగాణ జిల్లాల నుంచి రాకపోకలు జరిపే వాహనాలతో పాటు మరో పక్క ఈసీఐఎల్, రామక్రిష్ణాపురం తదితర ప్రాంతాలకు వెళ్లే ఆటోలతో నిత్యం రద్దీగా ఉంటోంది. కన్సూషన్‌లో సదరు చౌరస్తాలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఉదయం ఆఫీసులకు వెళ్లడానికి సాయంత్రం విధులు ముగించుకొని ఇళ్లలకు త్వరగా వెళ్తున్న నేపథ్యంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో కూడా ఓ మహిళ లాల్‌బజార్ పోస్టు ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగిని ఉదయం కార్యాలయానికి వెళ్తూ లాల్‌బజార్ చౌరస్తాలోనే ప్రమాదానికి గురై బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. అలాంటి సంఘటనలు తరు చూ జరుగుతూనే ఉన్నాయి. సిగ్నల్ వ్యవస్థ సరిగా ఉన్నప్పటికీ ప్రమాదాల పరంపరా కొనసాగుతూనే ఉంది. కంటోన్మెంటు అధికారులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా చౌరస్తాను పరిశీలించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని పలువురు ప్రయాణికులు, పౌరులు డిమాండ్ చేస్తున్నారు.



లాల్‌బజార్ చౌరస్తా నుంచి పగటివేల వెళ్తున్న లారీ

ప్రయాణికులు జాగ్రత్తలు తీసుకోవాలి



రాజీవ్ రహదారిలో లాల్‌బజార్ చౌరస్తా పెద్ద జంక్షన్‌గా మారింది. వేలాది మంది ప్రయాణికులు తమతమ అవసరాల కోసం పనుల నిమిత్తం, ఉద్యోగులు నగరం వైపు వెళ్తూ తిరిగి తమతమ గమ్యస్థానాలు చేరుకోడానికి లాల్‌బజార్ చౌరస్తా నుంచి రాకపోకలు కొనసాగిస్తూ ఉంటాయి. వాహనాలతో అధికంగా రద్దీ ఉంటున్న నేపథ్యంలో పౌరులు సైతం రాకపోకలను గమనిస్తూ వెళ్లాలి. ఇరువైపులా అక్కడ ఇబ్బందులు కలిగించే వ్యక్తులపై కేసులు కూడా నమోదు చేస్తున్నాం. ప్రమాదాలు జరుగకుండా పౌరులకు కొంత కౌన్సిలింగ్ కూడా చేసే విషయాన్ని పరిశీలిస్తున్నాం.

\- నాగరాజు, ఇన్‌స్పెక్టర్

సిబ్బంది అక్కడే విధులు నిర్వహిస్తున్నారు



తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన పోలీసులు తిరుమలగిరి చౌరస్తా, శాస్త్రీనగర్ చౌరస్తా, లోత్‌కుంట, అల్వాల్ మీ సేవా, బొల్లారం వాటర్ ట్యాంక్ వరకు చౌరస్తాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ ను క్లియర్ చేయడానికి కృషి చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. లాల్‌బజార్ చౌరస్తాలో రద్దీ అధికంగా ఉంటున్న నేపథ్యంలో ఎక్కువ సిబ్బంది అక్కడ విధులు నిర్వహిస్తూ ప్రమాదాలు జరుగకుండా చూస్తున్నారు. రెండు రోజుల క్రితం డ్యూటీకి వెళ్తున్న సాఫ్టవేర్ ఉద్యోగినిని బస్సు ఢీకొట్టడంతో మృతి చెందడం బాధాకరం. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం.

\- మధుబాబు, ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

జీవనాధారం లేకుండా చేయొద్దు

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ వ్యాపారులు స్ట్రీట్ వెండర్స్ పట్ల అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని మినిస్టర్ రోడ్డు, పీజీ రోడ్డు, సింధీ కాలనీలకు చెందిన పలువురు ఫుట్‌పాత్ వ్యాపారులు స్ట్రీట్ వెండర్స్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు తమ వ్యాపారాలకు అనుమతిస్తున్నా కూడా ట్రాఫిక్ సమస్యల పేరుతో తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు జీవనాధారం లేకుండా చేస్తే తమ కుటుంబాలను ఎట్లా పోషించుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ట్రాఫిక్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, నాగులు, టౌన్ వెండింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు తమ సమస్యను విన్నవించుకుంటున్న స్ట్రీట్ వెండర్స్ వ్యాపారులు

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సివిల్ ఏవియేషన్, డిఫెన్స్ ల్యాండ్స్‌లో నివాసం ఉంటున్న వివిధ బస్తీల ప్రజలు ఎమ్మెల్యే శ్రీగణేష్ తమ సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తినందుకు కృతజ్ఞతగా ఆయనను పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలోని సివిల్ ఏవియేషన్, డిఫెన్స్ ల్యాండ్స్‌లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న తమ సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని, తమ సొంత ఇంటి కల నెరవేర్చాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎన్నో ఏళ్లగా ఎంతో మంది నాయకులకు మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ తమ సమస్యలను పట్టించుకోవడమే కాకుండా అసెంబ్లీలో తమ సమస్యలను లేవనెత్తి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని, ఎమ్మెల్యే అవకముందు నుంచి కూడా ఆయన తమ సమస్యల మీద పోరాడుతున్నారని మహిళలు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కంటోన్మెంట్ ప్రజలు ఆశీర్వదించి తనను ఎమ్మెల్యే చేయడం వల్లనే వారి తరపున పోరాడుతున్నానని, వారి సమస్యల పరిష్కారం దిశగా పనిచేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్‌లోని వివిధ వార్డులకు చెందిన పలు బస్తీల ప్రజలు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ బోర్డు సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు

డబుల్ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా జరగాలి

మారేడుపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా జరగాలని శ్రీగణేష్ రెవెన్యూ అధికారులకు సూచించారు. దీనికిగాను ఓ ప్రత్యేక అధికారిని నియమించి, రెవెన్యూ అధికారులు మారేడుపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో శిబిరం ఏర్పాటు చేసి ముందుకు సాగాలన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, తదితరులు

బౌద్ధనగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. వారాసిగూడ జెడ్‌ఎం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం స్వాతంత్ర్య సమర యోధులను, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తోందని ఆరోపించారు. జైబాపు- జైభీమ్- జైసంవిధాన్ నినాదాన్ని క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలకు, శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఇంటికి చేరేలా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదం సృజన్‌కుమార్, బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు అమర్‌నాథ్‌గౌడ్, చక్రధార్, నవీన్, శ్రీకాంత్, ఆనంద్, శ్యామ్, రాధ, కల్పన, గీతాంజలి, రజిత, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.

యువతి అత్యాచార ఘటనలో దర్యాప్తు ముమ్మరం

అడ్డగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచార ఘటనలో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈనెల 22న రాత్రి సమయంలో సికింద్రాబాద్ నుంచి తెల్లాపూర్ వైపు వెళ్తున్న ఎంఎంటీఎస్ రైలులో జరిగిన ఘటనలో ఇద్దరు మహిళలు అల్వాల్ రైల్వే స్టేషన్‌లో దిగిపోగా యువతి ఒక్కతే బోగీలో ఉండిపోయింది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి అత్యాచార ప్రయత్నం చేయడంతో యువతి రైలు నుంచి దూకిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి జీఆర్‌పీ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలు నిందితుడి కోసం గాలిస్తున్నాయి. మొదటి రోజు గౌడవెల్లికి చెందిన వ్యక్తి ఫొటో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతికి చూపించగా 80శాతం ఇతనేనని పోలీసులకు సూచించింది. ఆ సమయంలో బాధితురాలు తీవ్ర గాయాలతో ఉంది. స్పష్టంగా చెప్పలేకపోవడంతో మళ్లీ జీఆర్‌పీ పోలీసులు మరో కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు 14రైల్వే స్టేషన్‌లు ఉండగా సీసీ కెమెరాలు లేకపోవడం ఎంఎంటీఎస్ రైలులో కెమెరాలు లేకపోవడంతో రైల్వే పోలీసులకు తలనొప్పిగా మారింది. సికింద్రాబాద్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి జీఆర్‌పీ పోలీసులు అనుమానితుల ఫొటోలు చూపించినప్పటికీ స్పష్టంగా గమనించలేకపోతోందని తెలిసింది. రెండో సారీ కూడా బాధితురాలి నుంచి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావెద్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది. పోలీసుల వద్ద ఉన్న ఇద్దరు అనుమానితుల ఫొటోలో ఒకరిని గుర్తించేందుకు జీఆర్‌పీ పోలీసులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఒక వైపు అల్వాల్ పోలీస్ స్టేషన్ సీఐ తిమ్మప్ప కూడా కేసు దర్యాప్తులో సహాయం అందిస్తున్నారు.

'ఇంకుడు గుంతలు తప్పనిసరి'

ముషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అడుగంటి పోతున్న భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ భవనాల వద్ద తప్పనిసరి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్ గౌడ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని జలమండలి కార్యాలయ ప్రాంగణంలో ఇంకుడు గుంత ఏర్పాటు పనులను జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నీటిని వృథగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జలమండలి డీజీఎం మోహన్‌రాజ్ మాట్లాడుతూ జలమండలి ఎండీ ఆదేశాల ప్రకారం భవనాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఇంకుడు గుంతలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 300 స్క్వేర్ మీటర్లు గల ఇళ్ల నిర్మాణాలు ఉన్న స్థలంలో తప్పనిసరి ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ విషయమై ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు.

హనుమాన్ ఆలయం ముస్తాబు



రామాలయానికి పేయింటింగ్ వేస్తున్న కార్మికులు

తిరుమలగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 6న జరుగనున్న శ్రీరామ నవమి వేడుకలకు బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీహనుమాన్ ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ మహేందర్ రెడ్డి తెలిపారు. ఆలయం ముందు నుంచి బస్సులు వెల్లకుండా అనుమతి కోసం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడానికి అనుమతి కోరుతూ లేఖలు అందజేశామని తెలిపారు. ఈనెల 30న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అదే రోజు హోమం, ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ



ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ముకుల్

సికింద్రాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తనయుడు ముకుల్ బాలంరాయిలోని పేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది ఈ తరహా కార్యక్రమం చేపట్టడం శ్రీగణేష్‌కు ఆనవాయితీ, అయితే ఈ ఏడాది శ్రీగణేష్ అసెంబ్లీ సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో ఆయన తరపున ముకుల్ శుక్రవారం బస్తీల్లో ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాము పేదలకు నిరంతరం అండగా ఉంటామని చెప్పారు.

స్విమ్మింగ్ పూల్ సిద్ధం

- ఏప్రిల్ 2 నుంచి ప్రజలకు అందుబాటులోకి
- రోజుకు ఆరు బ్యాచ్‌లు.. ఒక్కో బ్యాచ్‌లో 50 మందికి అవకాశం
- మహిళలకు ప్రత్యేకంగా సమయం కేటాయింపు

బేగంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉక్క పోత నుంచి సేద తీరేందుకు పిల్లలు, పెద్దలు కాసేపు ఈత కొలనులో సేద తీరేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలోనే స్థానికుల విజ్ఞప్తి మేరకు కొన్నేళ్ల క్రితం సనత్‌నగర్‌లో ఈత కొలను అందుబాటులోకి అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే గత ఏడాది ఓ బాలుడు ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందడంతో అప్పట్లో దీన్ని మూసివేశారు. ఈ వేసవిలో తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. సనత్‌నగర్‌లోని (కార్మిక సంక్షేమ కేంద్రం) ఆవరణలో ఉన్న ఈత కొలనును స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రెహానా బేగం, జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి, వెల్ఫేర్ గ్రౌండ్ ఇన్‌చార్జి మల్లేష్ గురువారం ప్రారంభించారు.

నెలకు రూ.500 చెల్లించాలి

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న సనత్‌నగర్ ఈత కొలనును రెండు బోర్ల ద్వారా గత రెండు నెలలుగా నింపుతున్నారు. సుమారు 160 ట్యాంకర్ల సామర్థ్యం గల నీటితో ఇప్పటికే పూర్తి స్థాయి వరకు నింపేశారు. ఈతకు వచ్చే వారు స్నానాలు చేయడం కోసం సమీపంలోనే 50 వేల లీటర్లను అందుబాటులో ఉంచారు. గతంలో జలమండలి ట్యాంకర్ల ద్వారా ఈత కొలనును నింపేవారు. ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్స్‌కు వాటర్ సరఫరా లేకపోవడంతో వెల్ఫేర్ గ్రౌండ్‌లో ఉన్న రెండు బోర్ల ద్వారా నింపినట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం 6-7, 7-8, 8-9 గంటలకు.. సాయంత్రం 4-5, 5-6 గంటలకు జనరల్ బ్యాచ్‌లను అనుమతిస్తారు. మధ్యాహ్నం 3-4 గంటల మధ్య మహిళల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయిస్తారని అధికారులు తెలిపారు. ఒక్కో బ్యాచ్‌లో సుమారు 50మంది వరకు ఈత కొట్టే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈత నేర్పేందుకు ఆరుగురు శిక్షకులు, నిర్వహణ కోసం ఏడుగురు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఈత కొలనును వినియోగించుకునేందుకు నెలకు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. www.ghmc.gov.in/sports వెబ్‌సైట్‌లో ఫీజు చెల్లించవచ్చు. ఈత కొలను కోసం దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా వైద్యుడు ధృవీకరించిన మెడికల్ సర్టిఫికెట్‌తో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన కాపీ, ఆధార్ కార్డు, ఫొటోను స్విమ్మింగ్ పూల్ ఇన్‌చార్జికి అందజేయాలి.



ఈత కొలనులో నిండుగా ఉన్న నీరు



స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించిన అనంతరం స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రెహానా బేగం, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి తదితరులు

ఏప్రిల్ 2 నుంచి అందుబాటులోకి

ఈత కొలనులో ప్రస్తుతం బ్లీచింగ్ వేయడంతో పాటు ఇతర పనులు జరుగుతున్నాయి. ఉగాది, రంజాన్ పండుగల అనంతరం దీనిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. ఏప్రిల్ 2 నుంచి సనత్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారికి 2నుంచి వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుంది. ఈతకు వచ్చే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. శిక్షకులు చెప్పిన విధంగా నడుచుకోవాలి. ఈత కొలనులో నీటిని నిత్యం శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం.

\- మాధవి, గేమ్స్ ఇన్‌స్పెక్టర్, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్